క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

వంగర: మద్యం తాగి వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ షేక్ శంకర్ హెచ్చరించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో వాహన తనిఖీలతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు శుక్రవారం చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి వాహనదారుడు వాహనంతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు.

ఆలయ ట్రస్టీగా దుర్గాప్రసాద్



బాధ్యతలు చేపడుతున్న దుర్గాప్రసాద్

రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ శాశ్వత ధర్మకర్తగా వాకచర్ల దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. 99 ఏళ్ల క్రితం వాకచర్ల వంశస్తులు నిర్మించిన ఈ ఆలయానికి ఆ కుటుంబీకులే వంశపారంపర్య ధర్మకర్తలుగా కొనసాగుతున్నారు. దుర్గాప్రసాద్ తండ్రి వాకచర్ల చినరామారావు మృతి అనంతరం వంశపారంపర్య ధర్మకర్తగా ఆయనను గుర్తిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు శుక్రవారం ఆలయ ఈఓ బీవీ మాధవరావు సమక్షంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు.

రోడ్లపై పశువులను విడిచిపెడితే చర్యలు



పశువులను తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాజాం సిటీ: రోడ్లపై పశువులను విడిచిపెడితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు హెచ్చరించారు. పట్టణంలోని రోడ్డులో రైతులు విడిచిపెట్టిన పలు పశువులను శుక్రవారం రాత్రి పట్టుకుని బొబ్బిలి రోడ్డులోని పంపుహౌస్ వద్దకు తరలించారు. అక్కడ పశువులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా నీటితొట్టెలు, గడ్డి ఏర్పాటు చేశామన్నారు. పాడిరైతులు పశువులను రోడ్డుపైకి రాకుండా కట్టడి చేయకుంటే పశువులను గోశాలలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు.

సమీక్ష సమావేశం



సమీక్ష నిర్వహిస్తున్న టీసీఎస్ బృందం

రాజాం: స్థానిక వెలుగు కార్యాలయంలో సెర్ప్ అప్లికేషన్లలో వచ్చే సమస్యలు, పరిష్కారాలు, కొత్త విధానాలపై హైదరాబాద్‌కు చెందిన టీసీఎస్ బృంద సభ్యులు సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు.రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల ఏపీఎంలు, సీసీలతో టీసీఎస్‌కు చెందిన భానుప్రియ, పద్మలతో పాటు మరో ఆరుగురు సమీక్ష చేసి, మొబైల్ బుక్ కీపింగ్, ఎంసీపీ, ఉన్నతి, స్త్రీనిధి యాప్, సీబీఓ అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్‌లు, యాప్‌లలో వచ్చే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను వివరించారు. సెర్ప్ అమలు చేస్తున్న యాప్‌లలో అభివృద్ధి చేయాల్సిన అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం ఎ.చిరంజీవి, స్త్రీనిధి మేనేజర్ ఎర్రినాయుడు, ఎల్‌హెచ్ ఏపీఎం పద్మ, ఐటీ యాంకర్ పర్సన్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ చెత్త సేకరణ చేయాలి



డీడీవో కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో సత్యనారాయణ

బొబ్బిలిరూరల్: ప్రతిరోజూ చెత్త సేకరణ చేయాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పరిషత్ సీఈవో బి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని మెట్టవలస, జగన్నాథపురం గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించి, గ్రామాల్లో చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించారు. తాగునీటి వనరుల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, జగన్నాథపురంలో కొత్తగా నిర్మిస్తున్న డీడీవో కార్యాలయం పనులను వేగవంతం చేయాలని కోరారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, జేఈ రాజశేఖర్, కార్యదర్శి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రైతన్నా..జరభద్రం!

- రసాయన ఎరువులతో తస్మాత్
- పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయం
- అప్రమత్తతే అన్నివిధాలా మేలు



రామభద్రపురంలో ఉల్లి పంటకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

రామభద్రపురం: పురుగుమందులంటేనే అత్యంత ప్రమాదకరమైనవి. అవి మన శరీరంలోకి వెళ్లినా వాటి వాసన మనం పీల్చినా ఆరోగ్యానికి హానికరం. పంటలపై పురుగుమందులు పిచికారీ చేయడంలో అవగాహన లేకపోవడం, సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి వాటితో రైతులు, వ్యవసాయ కూలీలు అనారోగ్యం పాలవుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం సాగులోని వరి, పత్తి, మొక్కజొన్న, కంది, కూరగాయల పంటలను ఆశించే చీడపీడల నివారణకు లేదా ఆయా పంటలలో కలుపు నివారణకు రసాయన మందుల పిచికారీ చేపడుతున్నారు. పంటలకు హాని జరుగుతుందన్న ఏమరపాటులో పిచికారీ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలను రైతులు మరిచిపోతున్నారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

అవసరమైన పరికరాలే వాడాలి..

పంటలకు పురుగుమందులు వాడడానికి వ్యవసాయ శాఖ సూచించిన స్ప్రేయర్లు(పరికరాలు)నే వాడాలి. ముఖ్యంగా పంటలో మొక్కల స్థాయిని బట్టి స్ప్రేయర్లు ఉపయోగించాలి. పత్తిలో హ్యాండ్ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్ల కన్నా తైవాన్ స్ప్రేయర్ల ద్వారా మొక్కలకు నేరుగా మందు పిచికారీ చేసే వీలుంటుంది.

విషపూరితమైనవి ఇలా తెలుసుకోవాలి..

పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఉపయోగించే పురుగు మందులపై రైతులు అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా పెస్టిసైడ్ దుకాణాల్లో పురుగుమందులు నాలుగు రంగుల్లో లభ్యమవుతాయి. వీటిలో ఏవి విషపూరితమైనవన్న విషయం తెలుసుకోవాలి. పుర్రె గుర్తుతో ఉన్న ఆకుపచ్చ, నీలి, పసుపు రంగులతో కూడిన డబ్బాలు ఉంటాయి. పుర్రె గుర్తుతో కూడి ఎర్ర రంగు ఉంటే అత్యంత విషపూరితమని గుర్తించాలి. ఆకుపచ్చ రంగు చిహ్నంతో ఉంటే తక్కువ విషపూరితమని తెలుసుకోవాలి.

మందు ప్రభావానికి గురైతే..

- పురుగు మందు ప్రభావానికి గురైన వ్యక్తి నోట్లో వేలు పెట్టి వాంతి చేయించాలి
- మూర్ఛపోయిన సందర్భంలో మూతికి గాయం కాకుండా రెండు దవడల మధ్య గుడ్డ ఉంచాలి
- శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు తడిబట్టతో నెమ్మదిగా తుడవాలి, శరీర ఉష్ణోగ్రత బాగా తగ్గితే దుప్పటి కప్పి వెచ్చగా ఉంచాలి, సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లాలి, అనారోగ్యానికి కారణమైన రసాయనాల వివరాలను వైద్యులకు చెప్పాలి

ఏమరుపాటు వద్దు..



పంటలకు పురుగుమందు పిచికారీ సమయంలో ఏమరుపాటుగా ఉండొద్దు. మనకు హాని కలగకుండా చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు పెట్టుకుని స్ప్రే చేయాలి. ప్రతి రైతు జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలి.

–మధుసూదనరావు, ఏడీ, వ్యవసాయ శాఖ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ✔ పురుగుమందు డబ్బా మూత నోటితో తీయవద్దు, మందు ద్రావణాన్ని చేతితో కలపవద్దు, సరిపడ మందు ఒకేసారి కలుపుకోవాలి
- ✔ పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయవద్దు, పిచికారీ సన్నగా, తుంపరలా ఉండేలా చూడాలి
- ✔ మందు తగిన మోతాదులోనే పిచికారీ చేయాలి, మోతాదుకు మించితే పంటలకు ప్రమాదం
- ✔ ఒకేసారి రెండు లేదా మూడు రకాల పురుగు మందులు కలిపి పిచికారీ చేయవద్దు
- ✔ చేతులకు గ్లౌజ్‌లు, కళ్లద్దాలు, ముఖానికి మాస్క్, తలకు టోపీ లేదా రుమాలు తప్పనిసరిగా ధరించాలి, చేతివేళ్లకు గోళ్లు పెంచుకోకూడదు, పత్తిలో అయితే కాళ్లకు బూట్లు ధరించాలి
- ✔ ఉదయం, సాయంత్రం గాలి ఎదురుగా వచ్చేటప్పుడు పురుగుమందు పిచికారీ చేయకూడదు, గాలి వీస్తున్న వైపే వెళ్లి పిచికారీ చేయాలి
- ✔ పురుగుమందు పిచికారీ సమయంలో పొగతాగరాదు, పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు తినవద్దు, చేతులు నోట్లో పెట్టుకోవడం, కళ్లు నలుపుకోవడం లాంటివి అస్సలు చేయవద్దు
- ✔ పంట ఏపుగా పెరిగి ఉంటే చేతిపంపుతో కాకుండా స్ప్రేయర్‌తోనే పిచికారీ చేయాలి
- ✔ గాయాలైన చేతులతో మందు పిచికారీ చేయరాదు, పిచికారీ పూర్తయిన వెంటనే కాళ్లు, చేతులు సబ్బుతో కడుక్కోవాలి, తలస్నానం చేయాలి
- ✔ పిచికారీ చేసేటప్పుడు ప్రత్యేకమైన దుస్తులు మాత్రమే ధరించాలి, వాటిని విడిచిన తర్వాత మిగతా దుస్తులతో కలిపి శుభ్రం చేయొద్దు
- ✔ చిన్నపిల్లలకు పురుగు మందులను సాధ్యమైనంత దూరం ఉంచేలా జాగ్రత్త పడాలి.
- ✔ పిచికారీ అనంతరం వినియోగించిన పురుగు మందు డబ్బాలను గోతి తీసి పాతిపెట్టాలి.

లక్ష్మీపేటను సందర్శించిన ఏఎస్పీ



లక్ష్మీపేట ప్రత్యేక న్యాయస్థానాన్ని సందర్శించిన ఏఎస్పీ నాగేశ్వరరావు

వంగర: మండలంలోని లక్ష్మీపేటను ఏఎస్పీ జి.నాగేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన 2012 జూన్ 12వ తేదీన జరిగిన ఘటనకు సంబంధించి ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాన్ని పరిశీలించారు. ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ వింగ్ అంశంలో భాగంగా కోర్టు పరిసరాలు, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై ఆరాతీశారు. ఇదిలా ఉండగా, వంగర పోలీస్‌స్టేషన్‌ను చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు శుక్రవారం తనిఖీ చేసి, శాంతి భద్రతల పరిరక్షణకు చేస్తున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర, ఎస్‌ఐ షేక్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

31న రారవే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 31వ తేదీన రారవే(రాజాం రచయితల వేదిక) సమావేశం నిర్వహించనున్నామని వేదిక కన్వీనర్ గార రంగనాథం ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. పొదిలాపు శ్రీనివాస్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో 'శిఖామణి దళిత కవిత్వం–ఒక పరిశీలన' అనే అంశంపై ఉత్తరాంధ్ర సాహిత్య విమర్శకులు పిల్లా తిరుపతిరావు ప్రసంగిస్తారన్నారు. సమావేశానికి రచయితలు, కవులు, భాషాభిమానులు హాజరుకావాలని కోరారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేద్దాం

తెలుగు మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొని, వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి, ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు వారి రంగాల్లో చేసిన కృషిని వక్తలు కొనియాడారు. తెలుగు భాషాభివృద్ధి, పరిరక్షణకు గిడుగు రామ్మూర్తి విశేషంగా కృషి చేశారని, ఆయన ఆశయ సాధన దిశగా అడుగులు వేస్తూ మన మాతృభాష అయిన తెలుగు పరిరక్షణకు పాటుపడాలని కోరారు. అనంతరం ఆయా దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రామభద్రపురం ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



బొబ్బిలిరూరల్: పక్కి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



బాడంగి: విశాఖలో మంత్రి దుర్గేష్ చేతులమీదుగా గిడుగు రామ్మూర్తి పురస్కారం అందుకుంటున్న జీకేఆర్‌పురం తప్పెటగుళ్లు కళాకారుడు సత్యం



బొబ్బిలి: తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న కారుణ్య ఫౌండేషన్ సీఈవో రాజు



బాడంగి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది



రామభద్రపురం: విజయనగరంలో వ్యాయామ ఉపాధ్యాయుడు రత్నకిశోర్‌ను సత్కరిస్తున్న డీఈవో



తెర్లాం:లోచర్ల హైస్కూల్‌లో భరతమాత, తెలుగు తల్లి వేషధారణల్లో విద్యార్థులు



రేగిడి: లింగాలవలస పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తెలుగుతల్లి, కవుల వేషధారణల్లో విద్యార్థులు, పక్కనే ఉపాధ్యాయులు



రాజాం: గడిముడిదాం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పైడిరాజు మాస్టారు, విద్యార్థులు



వంగర: అరసాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పరిపాలనలో కూటమి విఫలం



ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: పరిపాలన, ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని, అధికారంలోకి వచ్చి 14 నెలల కాలం దాటినా పథకాలన్నీ పూర్తిగా అమలు చేయడం లేదని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. స్థానిక పట్టణంలోని 28వ వార్డులో శుక్రవారం జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన..ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించారు. ఇప్పటివరకు అమలు చేసిన పథకాలు కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, ఒక్కో పథకం ఒక్కొక్కరికి ఒక్కోలా వర్తించిందని ఆరోపించారు. తల్లికి వందనం పథకం డబ్బులైతే ఒకరికి రూ.13 వేలు పడితే మరొకరికి రూ.10 వేలు, ఇంకొకరికి రూ.8 వేలు పడిందని ఉదహరించారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామన్నారని, అవెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం గాలికొదిలేసి, రాజకీయ కక్షలు, కుట్రపూరిత రాజకీయాలకు కూటమి ప్రభుత్వం తెరతీసిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ, కూటమి నాయకుల అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలంతా గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వారే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాలవలస ఉమాశంకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు ఇంటి గోపాలరావు, ఎస్వీ మురళీకృష్ణారావు, యువజన విభాగం అధ్యక్షుడు బేతనపల్లి శంకరరావు, మైనార్టీ విభాగం అధ్యక్షుడు అన్వర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో యంత్రాల వినియోగంతో పెట్టుబడి ఆదా



పురుగుమందు పిచికారీ చేసే డ్రోన్ అందిస్తున్న అధికారులు

వంగర: వ్యవసాయంలో ఆధునిక యంత్రాలు వినియోగిస్తే రైతులకు పెట్టుబడి ఆదా అవుతుందని ఏవో తట్టికోట కన్నబాబు అన్నారు. మండలంలోని పెదరాజులగుమ్మడ గ్రామంలో ఓం గణపతి రైతు మిత్ర సంఘానికి డ్రాగో కంపెనీ, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సంయుక్తంగా రుణం ద్వారా సమకూర్చిన పురుగుమందు పిచికారీ డ్రోన్‌ను ఏవో శుక్రవారం అందజేసి మాట్లాడారు. డ్రోన్ల ద్వారా పురుగుమందులు పిచికారీ చేయడం ద్వారా పైరుపై సమానంగా మందు పడుతుందని, ఎకరా పంటకు ఏడు నిమిషాల్లో పిచికారీ చేయవచ్చన్నారు. దీంతో సమయం కూడా ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నరేష్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శ్రీనివాసరావు మృతదేహం

రాజాం సిటీ: పట్టణానికి చెందిన యండమూరి శ్రీనివాసరావు(40) చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి..మృతుని తండ్రి మాధవరావు అనారోగ్యానికి గురై సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని విశాఖపట్నం గాజువాకలో నివాసం ఉంటున్న శ్రీనివాసరావు తెలుసుకుని ఈ నెల 25న చీపురుపల్లి వరకు ట్రైన్‌లో వచ్చాడు. అక్కడ నుంచి ఆటోలో వస్తూ బొద్దాం సమీపంలో డ్రైవరు షడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన శ్రీనివాసరావును చికిత్స నిమిత్తం స్థానికులు రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ వైద్యులు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని సీఐ పేర్కొన్నారు. మృతుని భార్య యండమూరి రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

సంతకవిటి: మండలంలోని గరికిపాడు గ్రామంలో చేస్తున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఏవో యశ్వంతరావు శుక్రవారం పరిశీలించారు. ప్రతి రైతు తమ పంటకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో కోరారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని కూరాకుల చెరువుకు సంబంధించిన సాగునీటి కాలువలోని పూడికలు తొలగించి, చెరువు పక్కనే ఉన్న పంట పొలాల ముంపు సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు డిప్యూటీ ఎంపీడీవో వెంకటరమణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల వల్ల వరదనీటితో పాటు మూడ్లవాని చెరువుకు వచ్చే నీరు కూడా కూరగాయల మార్కెట్ పక్కనుంచి వచ్చేసి మా పంట పొలాలను ముంచేస్తున్నాయని, కూరాకుల చెరువు నీరు వెళ్లే పంట కాలువ పూర్తిగా పూడికలతో నిండిపోవడం వల్ల నీరు సక్రమంగా వెళ్లే మార్గం లేక పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. దీంతో తాము సాగు చేసే పంటలు మునిగిపోయి పాడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి, పూడికలు తొలగించి వర్షపు నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వంగపండు తిరుపతి, కొల్లి అప్పలనాయుడు, మూడడ్ల పైడితల్లి, వంగపండు వాసు, మూడడ్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీటమునిగిన పంటలను పరిశీలించాలి



కొత్తచెలికానివలస వద్ద నీటమునిగిన పంటపొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు నీటమునిగిన పంటలను అధికారులు పరిశీలించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. మండలంలోని కొత్తచెలికానివలస, ఆమదాలవలస, రేగిడి గ్రామాల్లో నీటమునిగిన పంట పొలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరదల వల్ల పంటనష్టం అంచనా వేసి, రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల వల్ల ప్రధానంగా ఆకులలోవకట్టగెడ్డ, బందిగడ్డ, సాయన్నచానల్, తునివాడ చానల్ పరిధిలోని గ్రామాల పంటపొలాలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఖండ్యాం, ఆడవరం, కొమెర, అక్కన్నఅగ్రహారం, ఉప్పర్నాయుడువలస, వన్నలి, కొత్తచెలికానివలస, ఆమదాలవలస, అంబాడ, వెంకటాపురం, నాయిరాలవలస తదితర గ్రామాల పంటపొలాలు కూడా వరద తాకిడికి దెబ్బతిన్నాయన్నారు. రైతులకు ఓ పక్క ఎరువుల ఇబ్బంది మరోవైపు ఇలా పంటనష్టం కావడంతో దిక్కుతోచని స్థితిలో రైతు ఉన్నాడన్నారు. ఈ నేపథ్యంలో రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, బుగత కృష్ణ తదితరులు ఉన్నారు.